

రహదారులకు మోక్షం

- రూ. 150 కోట్ల నిధులు విడుదల చేసిన కేంద్రం
- మానేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 77 కోట్లు
- వేములవాడ-సిరికొండ రోడ్డు నిర్మాణానికి రూ. 23 కోట్లు
- అర్నకొండ-మల్యాల డబుల్ రోడ్డుకు రూ. 50 కోట్లు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలో రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో జిల్లాలో పలు రోడ్లకు మోక్షం లభించనున్నది. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 412.36 కిలోమీటర్ల మేరకు 34 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపుతూ 868 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. కేంద్ర రహదారులు, మౌలిక సదుపాయల నిధి (సీఆర్ఐఎఫ్) కింద రాష్ట్రానికి మంజూరైన 868 కోట్ల నిధుల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గానికి 150 కోట్లు కేటాయించారు.



గన్నేరువరంలో బీజేపీ నాయకుల సంబరాలు

● నెరవేరనున్న గన్నేరువరం వాసుల చిరకాల వాంఛ

మానేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలనే గన్నేరువరం మండల వాసుల చిరకాల వాంఛ కేంద్రం విడుదల చేసిన నిధులతో తీరనున్నది. మానకొండూర్ శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను పలు మార్లు కలిశారు. వంతెన ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని, నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మానేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు, గుండ్లపల్లి పాతూరు రోడ్డు, బావుపేట-ఖాజీపూర్ రోడ్డు నిర్మాణం వల్ల గన్నేరువ రంతో పాటు, కొత్తపల్లి, కరీంనగర్ మండలాల రవాణా కష్టాలు తీరనున్నాయి.

కరీంనగర్ పార్లమెంట్ ప్రజల రుణం తీర్చుకుంటా..

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

గన్నేరువరం-కొత్తపల్లి వరకు మానేరుపై హైలెవల్ వంతెన నిర్మాణంతోపాటు, వేములవాడ-సిరికొండ, అర్నకొండ-మల్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆమోదం తెలిపిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి గడ్కరీ, ఆ శాఖ ఉన్నతాధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ ప్రజల రుణం తీర్చుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. రాజకీయాలకు తావులేకుండా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని పార్టీల నేతలను కలుపుకుపోతున్నామన్నారు. అందులో భాగంగా కేశవ పట్నం నుంచి సైదాపూర్, కొడిమ్యాల నుంచి గోవిందారం మీదుగా తాండ్రియాల, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ నుంచి ముస్తాబాద్ మండలం బండలింగాపూర్ వరకు రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలను, చందుర్తి నుంచి మోత్కురావుపేట మధ్య బ్రిడ్జి, రామడుగు మండంలోని కిష్టంపల్లి బ్రిడ్జి, శంకరపట్నం మండలంలోని అర్కండ్ల కెనాల్ వద్ద హైలెవల్ బ్రిడ్జిసహా అనేక ప్రతిపాదనలను కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. దశలవారీగా ఆయా ప్రతిపాదనలకు సైతం ఆమోదముద్ర వేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

● మరో రెండు రోడ్లకు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యంతో పాటు, బీజేపి నాయకులు పలు మార్లు కేంద్ర మంత్రి దృష్టికి

(మిగతా 8వ పేజీలో)

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి అడ్లూరి



ముస్తాబైన పరేడ్ గ్రౌండ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి జిల్లా అధికారయంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 9.40 నుంచి 10.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాకేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఉదయం 9.40కి ఆయన తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించి, 9.50కి పోలీసు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. 10.02 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం రాష్ట్ర గీతాలాపన, వందన స్వీకారం తర్వాత మంత్రి జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ వేడుకల కోసం మైదానంలో షామియానాలు, కుర్చీలు, ఇతర ఏర్పాట్లను చేశారు.

పొలాల సందర్శన

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు ఆశించిన చీడ పీడల సమస్యలపై ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో 'వరి రైతు విల విల' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కేవీకే శాస్త్రవేత్త డి. శ్రీనివాస్, వ్యవసాయాధికారులు భూమిరెడ్డి, సతీష్ మండలంలోని సిర్సపల్లి, వెంకట్రావ్‌పల్లి, సింగాపూర్ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. గ్రామంలోని పొలాలను సందర్శించారు. వరిలో ఆకునల్లి, పాము పొడ తెగులు, దోమపోటు ఉన్నట్లు గమనించారు. ఆకునల్లి నివారణకు ఒబెరాన్ మందును ఒక మిల్లీ లీటర్ లీటర్ నీటికి కలిపి దీనితో పాటు టిల్ట్ అనే మందును మిల్లీ లీటర్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. దోమపోటు నివారణకు చెస్-120 లేదా పెక్సలాన్ మందులను పంటపై నుంచి కింది వరకు తడిసేలా పిచికారి చేయాలని సూచించారు.

పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మిస్తాం



మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలబాలికల కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మరుగుదొడ్లను నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ టదేశాయ్ తెలిపారు. మంగళవారం ఆయన సప్తగిరి కాలనీలో పర్యటించారు. డివిజన్లలో చేపడుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. చెత్త కలెక్షన్ పాయింట్లను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్ల ఇబ్బంది ఉందంటూ ఉపాధ్యాయులు కమిషనర్‌కు వివరించారు. వాటిని నిర్మించేందుకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి టెండర్లు నిర్వహించి, పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించార

ఘనంగా కృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఇల్లందకుంటలో స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న సిబ్బంది

ఇల్లందకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి గ్రామ దేవాయలంలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టారు. అనంతరం స్వామివార్లను పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, మాజీ ఎంపీటీసీ రాంస్వరన్‌రెడ్డి, ధర్మకర్తలు పరమేష్, గోపాల్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మల్లేష్, జూనియర్ అసిస్టెంట్ మోహన్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

'విద్యుత్ కుంభకోణంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'

గణేశ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో రెండేళ్ల క్రితం జరిగిన విద్యుత్ కుంభకోణంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెశిపెద్ది శ్రీధర్‌రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ ఈ విషయంపై బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేశామని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖలో రెండు సంవత్సరాల క్రితం విద్యుత్ బకాయిలను చెల్లించినట్లు కొంత మంది అధికారులు 39 లక్షల రూపాయలు స్వాహా చేశారన్నారు. లక్షలాది రూపాయలు స్వాహా చేసిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇంతవరకు విచారణ జరిపించలేదన్నారు. వెంటనే రాష్ట్రస్థాయి అధికారులు విచారణ జరిపించి దుర్వినియోగమైన నిధులను బాధ్యుల నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మధ్యవర్తిత్వం ద్వారా

కక్షిదారులకు సత్వర న్యాయం



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జడ్జి ఎస్ శివకుమార్, న్యాయాధికారులు

కరీంనగర్ లీగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. రాజీ ద్వారా కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వము ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య తగ్గుతుందన్నారు. అనంతరం జస్టిస్ కె లక్ష్మణ్,జస్టిస్ శ్యామ్ కోసి మాట్లాడారు. జిల్లా కేంద్రం లోని ఎస్సారార్ కళాశాలలో ఈ శిక్షణ తరగతుల ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఎస్ శివకుమార్ మాట్లాడుతూ ఉమ్మ డి జిల్లా వ్యాప్తంగా 90 మంది న్యాయవా దులను శిక్షణకు ఎంపిక చేశామన్నారు. వీరికి ఐదు రోజులపాటు మధ్యవర్తిత్వంపై మద్రాస్ నుంచి వచ్చిన శిక్షకులు తరగ తులు నిర్వ హిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసు కున్న న్యాయవాదులకు చివరి రోజు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారన్నారు. కార్య క్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి డి వెంకటేశ్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయ మూర్తి సీహెచ్ పంచాక్షరి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయ మూర్తి కె వెంకటేష్ పాల్గొన్నారు.

నారాయణపూర్ నిర్వాసితులకు పరిహారం అందిస్తాం

గంగాధర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం అందిస్తా మని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో రిజర్వాయర్ ముంపుగ్రామాలు నారాయణపూర్, మంగపేట గ్రామస్థులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను కలిశారు. ఈ సందర్భంగా ఏళ్లుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్నామని ముంపు గ్రామస్థులు బాదలను పట్టించుకుని పరిహారం అందేలా చేయాలని ఎమ్మెల్యేకు నిర్వాసితులు విన్నవిం చారు. స్పందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నారాయణపూర్ ముంపు సమస్యను తీర్చడానికి నీటిపారుదల శాఖ మంత్రితో మాట్లాడ నన్నారు. ప్రధాన సమస్యగా వివరించగా 23 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందజేస్తామన్నారు. ప్రతిపక్షాల మాటలను నమ్మి ఆందోళనకు గురికావద్దని, ముంపు గ్రామాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.



ముంపు బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రక్షణ గోడలు నిర్మించరా?



దేవంపల్లిలో కూలిన ఎస్సారెస్పీ ఉపకాల్వ బ్రిడ్జి రక్షణ గోడ

మానకొండూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవంపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ ఉపకాల్వ బ్రిడ్జి రక్షణగోడ కూలిపోయి ఏళ్లు గడిచాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాకతీయ ప్రధాన కాలువకు మండలంలోని దేవంపల్లి వద్ద డీబీఎం 6 ఉపకాల్వ తూము ఉంది. ఈ ఉపకాల్వ మండలంలోని దేవంపల్లి, లలితాపూర్, పచ్చునూర్, వీణవంక మండలంలోని పలు గ్రామాలతో పాటు జమ్మికుంట మండలంలోని పలు గ్రామాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తుంది. దేవంపల్లి గ్రామ శివారులో ఎస్సారెస్పీ ఉపకాల్వపై బ్రిడ్జిని నిర్మించారు. ప్రమాదాలు జరుగకుండా దానికి ఇరువైపుల రక్షణ గోడలు ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల క్రితం ఈ రక్షణ గోడలు కూలిపోయాయి. ఈ రోడ్డు మీదుగా లలితాపూర్, దేవంపల్లి, కెల్లేడు, కొండపల్కల, మద్దికుంట తదితర గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. పంటలకు సాగు నీరును సరఫరా చేసే సమయంలో కాల్వ నీటి ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. దీంతో ప్రయాణీకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రెండు వైపుల కూలిన రక్షణ గోడలను తిరిగి నిర్మించాలని దేవంపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో భారీ ప్రక్షాళన

- తొమ్మిది మంది సిబ్బంది తొలగింపు
- అవినీతి ఆరోపణలే కారణమా?

6

విద్యార్థులకు సౌకర్యాలు సమకూర్చాలి..



చొప్పదండి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చొప్పదండి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూర్చాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే అన్నారు. పట్టణంలోని ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే తొలగించాలన్నారు. మరుగుదొడ్లకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత ఎస్ఈని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, హాస్టల్ వార్డెన్, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత...



ఎక్లాస్‌పూర్-సోమారం గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై ఏర్పడిన గుంత

సైదాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్-సోమారం గ్రామాల మధ్య సోమారం వాగుపై లో లెవల్ వంతెనపై పెద్ద గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెనపై నుంచి భారీగా వరద నీరు ప్రవహించింది. దీంతో వంతెన మధ్య గుంత ప్రమాదకరంగా ఏర్పడింది. వాహనదారులు గమనించడా వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. స్థానికులు తాటి కమ్మలను ఆ గుంతలో ఉంచారు. ఎక్లాస్‌పూర్ గ్రామ ప్రజలకు ఈ రోడ్డే ప్రధాన రహదారి. రాత్రంబవళ్లు వాహనాలు తిరుగుతుంటాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గొర్రె పిల్ల అపహరణపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామంలోని గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గొర్రె పిల్లను అపహరించిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. తన గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.6 వేల విలువైన గొర్రె పిల్లను ఎత్తుకెళ్లారని బాధితురాలు బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

విద్యుత్‌ తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని రైతు ధర్మాగౌడ్‌కు చెందిన వ్యవసాయ విద్యుత్‌ తీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న రూ.30 వేల విలువైన విద్యుత్‌ తీగను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని రైతు ధర్మాగౌడ్‌ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి చేసినట్లు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌, టిప్పర్‌ పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌, టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కేశవపట్నం పోలీసులు తెలిపారు. హుజూరాబాద్‌ మండలానికి చెందిన రాపోలు కుమార్‌, వేణు అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఎక్స్‌కావేటర్‌, టిప్పర్‌తో మట్టి తరలిస్తుండగా కొత్తగట్టు శివారులో పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరీంనగర్‌ టాస్క్‌ఫోర్స్‌లో భారీ ప్రక్షాళన

తొమ్మిది మంది సిబ్బంది తొలగింపు

అవినీతి ఆరోపణలే కారణమా?

కరీంనగర్‌ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌ కమిషనరేట్‌లో అక్రమ దందాలపై దాడులు, అక్రమార్కులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్‌ సిబ్బందిలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇసుక అక్రమ దందా, పేకాట, వ్యభిచారం, గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, మద్యం అక్రమ అమ్మకాలు, గుడుంబా, నాటుసారా, డ్రగ్స్‌, పీడీఎస్‌ బియ్యం అక్రమ రవాణా, కల్తీ వంట నూనె, ఆహార పదార్థాలు వంటి దందాలపై ఉక్కుపాదం మోపి, నేరస్థులను కటకటాల్లోకి నెట్టేందుకు దశాబ్దాల కాలంగా టాస్క్‌ఫోర్స్‌ విభాగం కమిషనరేట్‌లో కొనసాగుతున్నది. పోలీస్‌ కమిషనర్‌ ఆధ్వర్యంలో ఈ టాస్క్‌ఫోర్స్‌ పోలీసు టీం పని చేస్తుంటుంది. పోలీస్‌ కమిషనర్‌తో పాటు స్పెషల్‌ బ్రాంచి, ఇతర విభాగాలకు అంది న సమాచారంతో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు రంగంలోకి దిగి నేరస్థుల ఆటక ట్టిస్తుం టారు. పోలీస్‌ స్టేషన్ల పరిధిలో నడు స్తున్న అక్రమ దందాలపై టాస్క్‌ఫోర్స్‌ నేరుగా దాడులు నిర్వహించి నిందితులను స్థానిక పోలీసులకు అప్పగిస్తుంది. స్థానిక పోలీ సులకు ఉన్న పరిచయాలతో కొన్ని సందర్భాల్లో కొన్ని అక్రమ దందాలను స్థానిక పోలీసులు పట్టించుకోరనే విమర్శలు న్నాయి. ఈ సందర్భంలో టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు రంగంలోకి దిగి అక్రమ దందాలను అరికడ తారు. టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు నేరుగా పోలీస్‌కమిషనర్‌కు అనుబంధంగా ఉంటారుకాబట్టి ఎలాంటి అవకతవకలకు తావు ఉండదనే భావన ఉంది.




సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించి..

కరీంనగర్‌ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై ఇటీవల అవినీతి ఆరోపణలు వచ్చినందునే సిబ్బందిని పూర్తిగా తొల గించినట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్‌లో ఒక ఏసీపీ, సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ఏడుగురు కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. ఇందులో ఎస్‌ఐ, ఏఎస్‌ఐతో సహా ఏడుగురు కానిస్టేబుళ్లను తొలగించిన పోలీస్‌ కమిషనర్‌ వారిని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్‌ చేయాలని సోమవారమే మౌఖిక ఆదేశాలే జారీ చేశారు. కొద్ది రోజుల కిందట నిషేధిత గుట్కాను భారీ ఎత్తున పోలీసులు పట్టుకున్నారు. అంతకు ముందు పీడీఎస్‌ బియ్యం, గంజాయి, పేకాట శిబిరాలపై దాడులు చేసిన సందర్భాల్లో కొంత అవకత వకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ముఖ్యంగా పేకాట శిబిరాలపై దాడులు చేసిన సమయాల్లో కొందరిని తప్పించడం, నిర్వాహకులపై కేసులు నమోదు చేయ కపోవడం, డబ్బుల లెక్కల్లో కూడా తేడా రావడంపై ఆరోపణలు ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్‌ దాడులు చేసిన ఘటనల్లో అవినీతికి పాల్పడినట్లు పోలీస్‌ కమిషనర్‌కు పక్కాగా సమాచారం ఉండడంతోపాటు, ఫిర్యాదులు కూడా అందినందునే ఈ చర్యలు తీసుకున్నారని తెలిసింది. కొద్ది రోజులుగా టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది కదలికలపై ప్రత్యేక పోలీసు లతో నిఘా పెట్టారు. ఆరోపణలు నిర్ధారణ అయిన వెంటనే తొమ్మిది మందిని తొలగించారు. టాస్క్‌ఫోర్స్‌ విధుల నుంచి తొలగించిన 9 మంది మంగళవారం ఏఆర్‌ ఆర్‌ఐకి రిపోర్ట్‌ చేశారు.

ముందుగానే సమాచారం లీక్‌

కొత్తగా టాస్క్‌ఫోర్స్‌లో నియామకాల కోసం అవినీతి మరకలు లేని సిబ్బందిని ఎంపిక ప్రక్రియ జరుగుతున్నది. గతంలో కూడా చాలా సంద ర్భాల్లో పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్‌, స్థానిక పోలీసులు దాడి చేసిన సంద ర్భాల్లో నిందితులు అక్కడి కొన్ని నిమిషాల ముందే తప్పించుకునేవారు. సమా చారం అందించినవారికి అనుమానం కలిగే ది. అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇంకా కొన్ని ఘటనల్లో సమాచారం అందించినవారి పేర్లు కూడా బయటకు వచ్చాయని చెబుతుండేవారు. స్థానిక పోలీసులకు ఉన్న ఒక రకమైన స్నేహం వల్లనే పట్టించుకోరనే వాదన ఉండేది. నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరిస్తారని భావిస్తున్న టాస్క్‌ఫోర్స్‌తో కూడా సరైన న్యాయం జరగడం లేదనే భావన కొందరిలో ఉంది. దీని కారణంగా అక్రమ కార్యకలా పాల గురిం చి, అసాంఘిక శక్తుల వివరాలు పోలీసులకు అందించేందుకు ఇది సమస్యగా మారు తుందని గుర్తించిన సీపీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. కమిషనరేట్‌ పరిధిలోని పలు స్టేషన్లలో కూడా కొందరు సిబ్బంది ఇదే విధంగా వ్యవహరిస్తు న్నారనే ఆరోపణలున్నాయి. వీటిపై కూడా పోలీస్‌ కమిషనర్‌ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ట్రాఫిక్‌ జరిమానా చెల్లించిన పోలీసుశాఖ డ్రైవర్లు

కరీంనగర్‌ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌ ఉల్లంఘన నకు సంబంధించి పోలీసు శాఖ డ్రైవర్లు మంగళవారం జరిమానా చెల్లించారు. కరీంనగర్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో ట్రాఫిక్‌ నిబంధనలు ఉల్లఘించడంతో పోలీసు వాహనాలకు చలాన్‌ల రూపంలో జరిమానాలు పడ్డాయి. ఈ జరిమానాలను వాహనం నడిపిన పోలీసుశాఖ డ్రైవర్లే చెల్లించాలని సీపీ గౌస్‌ ఆలం ఆదేశించారు. దీంతో కమిషనరేట్‌ వ్యాప్తంగా ఆయా వాహనాలకు చెందిన 25 మంది డ్రైవర్లు చలాన్‌ రూపంలో జరిమానా చెల్లించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తూ ఆదర్శంగా ఉంటేనే ప్రజలు అనుసరిస్తారనే ఉద్దేశంతో ఈ చర్యలకు ఉపక్రమించారు.

అంధ విద్యార్థుల వీడియో ఆల్బమ్‌ను ఆవిష్కరించిన సీఎం

కరీంనగర్‌ టౌన్‌, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులు పాడి రూపొందించిన దివ్యదృష్టి వీడియో ఆల్బమ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థులు రాగయుక్తంగా స్తోత్రాలను ఆలపించడం ఆనందాన్నిచ్చిందన్నారు. ఎంతో కృషి అభ్యాసం ఉంటే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. కలెక్టర్‌ పమేలా సత్పతి విద్యారంగంలో చిన్నారులను ప్రోత్సహించడం ఆదర్శనీయమన్నారు. వీడియో ఆల్బమ్‌కు దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్‌, సంగీతాన్ని అందించిన కె.బి.శర్మ, సంగీత ఉపాధ్యాయిని సరళ, వీడియోగ్రఫీ చేసిన లక్ష్మీగౌతమ్‌ను సీఎం అభినందించారు. అనంతరం కలెక్టర్‌ విద్యార్థులతో కలిసి సచివాలయాన్ని సందర్శించారు. కరీంనగర్‌ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌, కలెక్టర్‌ పమేలా సత్పతి, చిన్నారి గాయకులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్‌, సాయిరామ్‌, మణిదీప్‌, అక్షయ్‌, వరుణ్‌తేజ్‌, మణిరతన్‌, లోహిత్‌, ప్రభుత్వ బధిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో కొత్తపల్లి వాసి మృతి



రాజయ్య(ఫైల్‌)

గంభీరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజయ్య (70) అనే వ్యక్తి గల్ఫ్‌లో గుండె పోటుతో మృతిచెందాడు. రాజయ్య 15 ఏళ్లుగా సౌదీ వెళుతున్నాడు. ఈ నెల 13న రాజయ్య గుండెపోటుకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు ఫోన్‌ ద్వారా సమాచారం అందింది. రాజయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ

- సరైన పత్రాలు లేని 21 వాహనాలు సీజ్‌



వాహనాలు తనిఖీ చేస్తున్న డీటీవో

తిమ్మాపూర్‌, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణాశాఖ, ట్రాఫిక్‌ పోలీసుల సంయక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నూతనంగా ఎంపికైన అసిస్టెంట్‌ మోటార్‌ వెహికిల్‌ ఇన్స్‌పెక్టర్లకు శిక్షణలో భాగంగా మంగళవారం వాహనాల తనిఖీ ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించినట్లు కరీంనగర్‌ జిల్లా ట్రాన్స్‌పోర్ట్‌ అధికారి శ్రీకాంత్‌ చక్రవర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా డ్రైవింగ్‌ లైసెన్స్‌, ఇన్సూరెన్స్‌, ఇతర పత్రాలు లేని 21 వాహనాలను సీజ్‌ చేసినట్లు తెలిపారు. సుమారు 75వేల రూపాయల వరకు జరిమానా విధించినట్లు శ్రీకాంత్‌ చక్రవర్తి తెలిపారు. ప్రతి వాహనాదారుడు తమ వాహనాల పత్రాలను సరిచూసుకోవాలని సరియైన పత్రాలు లేనిదే రోడ్డు పైకి వస్తే జరిమానాతో పాటు వాహనాలను సీజ్‌ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్‌ సిఐలు పర్శ రమేష్‌, ఆర్‌ఐ కుమారస్వామి, ఎస్సైలు, ట్రైనీ ఏఎంవీఐలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

● 43గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్‌ (27)ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్‌సీఐ మొగిలి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌ జల్సాలకు అలవాటు పడటంతో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గంజాయికి అలవాటుపడటమే కాకుండా వ్యాపారం చేయాలనుకున్నాడు. ప్రస్తుతం కరీంనగర్‌కు చెందిన అరవింద్‌ వద్ద గంజాయిని మూడు రోజుల క్రితం కొనుగోలు చేసి ఇంటికి తీసుకవచ్చాడు. కొంత గంజాయిని తాగి మిగిలిన దానిని అమ్మడానికి మంగళవారం ద్విచక్రవాహనంపై వెళుతుండగా జంగమరెడ్డిపల్లె కమాన్‌ వద్ద పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 43 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయి, ద్విచక్రవాహనం, మొబైల్‌ఫోన్‌ స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై లక్‌పతి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో వేములవాడ అర్బన్‌ పరిధిలోని చింతల్‌ఠాణాకు చెందిన మంత్రి ఆనందంకు జీవిత ఖైదు రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ మహేష్‌ బి. గీతే తెలిపిన వివరాల ప్రకారం... జూలపల్లి మండలంలోని తేలుకుంటకు చెందిన మర్రిపెల్లి రాజయ్య(64) అనే వ్యక్తి వేములవాడ శివారులోని ఓ మామిడితోటలో తోటకాపరిగా ఉన్నాడు. ఇతనితో పాటు మంత్రి ఆనందం తోటకాపరిగా పనిచేస్తుండేవాడు. వీరి మధ్య తరచుగా తోటపని విషయంలో గొడవలు జరిగేది. ఈ గొడవల్లో భాగంగా ఏప్రిల్‌ 29,2024న రాత్రి అంతకుముందు తిట్టిన విషయంను ఆనందం మనసులో పెట్టుకొని ఇనుపరాడుతో రాజయ్య తలపై బాది హత్యచేశాడు. రాజయ్య కుమారుడు శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వేములవాడ టౌన్‌ సీఐ వీరప్రసాద్‌ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్‌ మహేందర్‌ నవీన్‌లు కోర్టులో 16మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ పెంట శ్రీనివాస్‌ కేసు వాదించగా పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించారు. శిక్ష పడటంలో కృషి చేసిన వేములవాడ టౌన్‌ సీఐ వీరప్రసాద్‌ను, పీపీ పెంట శ్రీనివాస్‌, కోర్టు మానిటరింగ్‌ ఎస్‌ఐ రవీంద్రనాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్‌, నవీన్‌లను ఎస్పీ అభినందించారు.

కొనుగోళ్ల కమీషన్‌లో అవకతవకలపై నిలదీత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్‌లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని, లెక్కలు చెప్పాలంటూ సభ్యులు, స్థానికులు మంగళవారం ఆందోళనకు దిగారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో మంగళవారం ఐకేపీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల గ్రామైఖ్య సంఘం వారు వరి ధాన్యం కొనుగోలు చేశారని అందుకు వచ్చిన కమీషన్‌ లెక్కలు చెప్పకుండా దాట వేస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్‌, ఇతర లెక్కలు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ సమావేశాన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నామని ఐకేపీ ఏపీఎం సుదర్శన్‌ వివరించడంతో శాంతించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మల్యాల బ్లాక్‌ చౌరస్తా సమీపంలో మంగళవారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. కట్టెకోల మల్లేశ్వరి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రామన్నపేటలో తన అక్క ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంటికి రాగా వెనుకాల గేట్‌ గొలుసు పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలోని తులం బంగారు ఆభరణాలు, పది తులాల వెండితో పాటు రూ.10 వేల నగదు దొంగలు ఎత్తు కెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందిం చింది. ఎస్సై ఏ.నరేశ్‌కుమార్‌ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.300 కోసం ఆటో డ్రైవర్‌ హత్య

● కిరాయి చెల్లింపు విషయంలో వాగ్వాదం ● వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌



మృతుడు నయిమొద్దీన్‌ (ఫైల్‌)

జగిత్యాలరూరల్‌, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్‌ మండలం హైదర్‌పల్లి సమీపంలో రూ.300 కోసం ఆదివారం అర్థరాత్రి ఆటో డ్రైవర్‌ నయిమొద్దీన్‌(50)ను బీహార్‌కు చెందిన ఇద్దరు కూలీలు బండరాయితో మోది దారుణంగా హత్య చేశారు. నిందితులైన దర్శన్‌ సాహ్ని. సునీల్‌ సాహ్నిలను పోలీసులు మంగళవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల రూరల్‌ సీఐ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రఘుచందర్‌ హత్య కేసు వివరాలను వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని సుతారిపేటకు చెందిన ఎండీ నయిమొద్దీన్‌ పట్టణంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. బీహార్‌ రాష్ట్రానికి చెందిన దర్శన్‌సాహ్ని, సునిల్‌ సాహ్ని, పంకజ్‌ అనే ముగ్గురు జగిత్యాల మండలం హైదర్‌పల్లి, పొలాస శివారులో గల రైస్‌ మిల్లుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి జగిత్యాల నుంచి వారు పనిచేసే రైస్‌ మిల్లులకు వెళ్లేందుకు ముగ్గురు బీహార్‌ కూలీలు నయిమొద్దీన్‌ ఆటోను అద్దెకు మాట్లాడుకున్నారు. పంకజ్‌ అనే బీహార్‌ కూలీ పొలాస దగ్గర దిగిపోయి ఆటో కిరాయి మిగిలిన వారు ఇస్తారని డ్రైవర్‌తో చెప్పాడు. ఆటో హైదర్‌పల్లిలోని రైస్‌మిల్లు సమీపంలోకి రాగానే ఆటో డ్రైవర్‌ నయిమొద్దీన్‌ బీహార్‌ కూలీలైన దర్శన్‌ సాహ్ని. సునీల్‌ సాహ్నిలను కిరాయి డబ్బులు అడిగాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలోనే మాటామాటా పెరిగి ఆటోడ్రైవర్‌ నయిమొద్దీన్‌ గొంతును టవల్‌తో దర్శన్‌ సాహ్ని అనే కూలీ బిగించగా మరో నిందితుడు సునీల్‌ సాహ్ని బండరాయితో దాడిచేసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడేశారు. మృతుడు నయిమొద్దీన్‌ సోదరుడు ఇసాక్‌ఖాన్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జగిత్యాల రూరల్‌ పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా హత్య కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి మృతుడు నయిమొద్దీన్‌ మొబైల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్‌ తెలిపారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్‌

యువతి ఆకస్మిక మృతి

జ్యోతినగర్‌, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్‌ (పీటీఎస్‌)లో మంగళవారం పొగిడి అనూష(29) అనే యువతి మృతి చెందింది. అనూష మృతిపై ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీపీసీ సంస్థలో అధికారిగా పనిచేస్తున్న పొగిడి జయరాజు పీటీఎస్‌లోని డి టైపు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. జయరాజు కుమార్తె అనూష కొంత కాలంగా మానసికంగా ఇబ్బందిపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కుమార్తె నిద్ర లేవకపోవడతో ఆమెను లేపే ప్రయత్నం చేశాడు. కదలికలు లేకపోవడంతో అనూషను టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. ఆమెను పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ప్రకటించారు. విషయాన్ని జయరాజు ఎన్టీపీసీ పోలీసుకు తెలిపారు. ఎన్టీపీసీ ఎస్‌ఐ టి.ఉదయ్‌కిరణ్‌ సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. అనూష మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

చోరీలకు పాల్పడుతున్న విద్యార్థి అరెస్టు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలావాటు పడి, డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్న డిగ్రీ విద్యార్థి కవ్వంపల్లి అరుణ్‌ కుమార్‌(20)ని మంగళవారం అరెస్టు చేసినట్టు డీసీపీ కరుణాకర్‌ పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. గోదావరిఖని పట్టణంలోని విఠల్‌నగర్‌లో ఈ నెల 10, 11తేదీల్లో రాత్రి ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తి చోరీలకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్‌ ఇన్‌స్పెక్టర్‌ ఇంద్రసేరెడ్డి ఎస్‌ఐలు, క్రైమ్‌ పార్టీ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఫైవింక్లయిన్‌ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న అరుణ్‌కుమార్‌ను పట్టుకున్నారు. అతన్ని విచారించగా తాను డిగ్రీ విద్యార్థినని, చెడు అలవాట్లకు బానిసై జల్సాలకు డబ్బుల కోసం చోరీలకు పాల్పడినట్టు తెలిపాడన్నారు. తాళం వేసిన ఇండ్లను గుర్తించి వెనుక డోర్లు పగులగొట్టి చోరీలకు పాల్పడేవాడన్నారు. దొంగిలించిన సొత్తును విక్రయించి జల్సాలు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 23.6గ్రాముల బంగారు ఆభరణాలు, 45తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సొత్తు విలువ రూ.1.93లక్షలు ఉంటుందని డీసీపీ పేర్కొన్నారు.

చోరీ సొత్తు కొన్నా, తాకట్టు పెట్టుకున్నా కేసులే..

చోరీ సొత్తును ఎవరైనా కొనుగోలు చేసినా, తాకట్టు పెట్టుకున్నా వారిపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ పేర్కొన్నారు. ప్రైవేట్‌ గోల్డ్‌లోన్‌ కంపెనీలు తాకట్టు పెట్టుకునే సమయంలో అన్ని విచారణలు జరుపాలని, వివరాలు తీసుకోవాలన్నారు. అలా కాదని చోరీ సొత్తును తాకట్టు పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కేసును ఛేధించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ అనూష, క్రైమ్‌ పార్టీ హెడ్‌ కానిస్టేబుల్‌ రమేష్‌, సదానందం, కానిస్టేబుళ్లు మధుకర్‌, మధుసూధన్‌, రమేష్‌లకు డీపీసీ క్యాష్‌ రివార్డు అందజేశారు. ఏసీపీ రమేష్‌, సీఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక కోసం వెళ్లి.. మానేరులో చిక్కుకొని

● కాపాడిన స్థానికులు, పోలీసులు

సుల్తానాబాద్‌, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌ మండలంలోని గట్టెపల్లికి చెందిన కొందరు ట్రాక్టర్‌ యజమానులు, కూలీలు ఇసుక కోసం ట్రాక్టర్లతో మానేరు వాగులోకి మంగళవారం ఉదయం వెళ్లారు. కరీంనగర్‌లోని ఎల్‌ఎండీ నుంచి నీరు విడుదల చేసిన విషయం వారికి తెలియదు. మహిళతో పాటు ఎనిమిది మంది వాగులో ఇసుక నింపుతుండగా ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగడంతో చిక్కుకుపోయారు. వారు బయటకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రవాహంలో ట్రాక్టర్లు కొట్టుకుపోయాయి. బాధితులు పెద్దగా కేకలు వేయడంతో వాగు ఒడ్డున ఉన్న వారు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్‌ కుమార్‌ మానేరు వాగు వద్దకు వచ్చి స్థానికుల సహాయంతో వాగులో ఉన్న వారిని తాళ్లతో బయటకు తీసుకువచ్చారు.



గట్టెపల్లి మానేరు వాగులో చిక్కుకున్న వారిని తాళ్లతో బయటకు తీస్తున్న స్థానికులు

● ఎవరూ వాగులోకి వెళ్ల వద్దు

ఎవరూ మానేరు వాగులోకి వెళ్లవద్దని సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్‌ కుమార్‌లు హెచ్చరించారు. మానేరు పరివాహక ప్రాంత గ్రామాలకు చెందిన ఇసుకను తరలించే ట్రాక్టర్‌ యజమానులు, డ్రైవర్లు కూలీలతో సమావేశం నిర్వహించి మానేరు గేట్లు ఎత్తడంతో నీటి ఉధృతి పెరిగిందని ప్రమాదకరంగా ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్‌ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

అర్కండ్ల వాగులో కొట్టుకుపోయి.. సురక్షితంగా ఒడ్డుకు



అర్కండ్ల వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తి

శంకరపట్నం: మండలం అర్కండ్ల లోలెవెల్‌ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి జారిపడి నీటి ప్రవాహంతో కొంత దూరం కొట్టుకుపోయి సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల లో లెవెల్‌ బ్రిడ్జిపై నుంచి నీరు భారీగా ప్రవహిస్తుండగా ఓ వ్యక్తి నడుచుకుంటూ వాగు దాటే ప్రయత్నం చేశాడు. లో లెవెల్‌ బ్రిడ్జి నాచు పట్టి ఉండడంతో జారిపడి నీటి ప్రవాహంలో కొంత దూరం కొట్టుకుపోయాడు. ఆధారం దొరకగానే ఈదుకుంటూ బయటకు సురక్షితంగా చేరాడు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తలకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ క్రాంతి కుమార్‌ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన మాదం రత్నాకర్‌ (40) తన ద్విచక్ర వాహనంపై పిడిసిల్ల నుంచి కల్లుపల్లెకు ఈ నెల 12న వెళ్తుండగా బూజునూర్‌ గ్రామంలో కుక్కలు అడ్డు రాగా బైక్‌పై నుంచి జారి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్‌ అర్బన్‌, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్‌ రూరల్‌ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌ రూరల్‌ మండలం గోపాల్‌పూర్‌ క్రాస్‌రోడ్‌ వద్ద ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

● పరారీలో అత్తమామలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌లో ఈ నెల 14న మేడి రమాదేవి అలియాస్‌ పూసాల ప్రశాంతి హత్య కేసులో నిందితుడు ఆమె భర్త పూసాల కృపాకర్‌ అలియాస్‌ ప్రభాకర్‌ (45)ను మంగళవారం అరెస్టు చేసినట్టు డీసీపీ కరుణాకర్‌ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న ఉదయం ప్రశాంతిని ఆమె భర్త హత్య చేశాడని, గోదావరిఖని ఏసీపీ రమేష్‌ ఆధ్వర్యంలో రామగిరి ఎస్‌ఐలు శ్రీనివాస్‌, దివ్యలు ప్రత్యేక టీములతో నిందితున్ని లద్నాపూర్‌ వద్ద పట్టుకున్నారన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు కృపాకర్‌ తల్లిదండ్రులైన శ్యామల, రంగయ్యలు పరారీలో ఉన్నారన్నారు. మంచిర్యాల రెడ్డి కాలనీకి చెందిన రమాదేవి అలియాస్‌ ప్రశాంతిని పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్‌లో నివాసముండే పూసాల కృపాకర్‌ వేరు వేరు సామాజికవర్గాలకు చెందిన వారు 13ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. వీరికి కుమారుడు జాన్సన్‌(10), కుమార్తె జోషిత్‌(9), జ్యోత్స్న(7)లు ఉన్నారు. ఏడాదిగా వీరి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి భార్యభర్తలు వేరువేరుగా ఉంటున్నారు. ఈ నెల 14న రమాదేవి కృపాకర్‌ ఇంటికి వచ్చిందని, ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. రమాదేవిని చంపితేనే సమస్య పరిష్కారమవుతుందని భావించి కృపాకర్‌ ఆమెపై కత్తితో దాడి చేశారన్నారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు డీసీపీ తెలిపారు. అత్తమామలు పరారీలో ఉన్నారని, విచారణ జరుగుతుందన్నారు. సమావేశంలో గోదావరిఖని ఏసీపీ రమేష్‌, వన్‌టౌన్‌ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామగిరి ఎస్‌ఐ శ్రీనివాస్‌, దివ్య పాల్గొన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్‌

నిధులు మంజూరు చేయాలి

- వాగులో కూర్చొని యువకుడి నిరసన



వాగు నీటిలో కూర్చున్న మోహన్‌

చందుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఓ యువకుడు ఎనగల్‌ గ్రామంలో వాగులో కూర్చొని మంగళవారం ఆందోళన చేపట్టాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎనగల్‌ గ్రామంలో పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల సమీపంలో వాగులో వంతెనలు నిర్మించాలని పుప్పాల మోహన్‌ అనే యువకుడు వాగులో కూర్చొని ఆందోళన చేపట్టాడు. వ్యవసాయ పనుల కోసం రైతులు, ఈత, తాటి వనానికి వెళ్లేందుకు గౌడ కులస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ)కు మంగళవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 37 గేట్లు పైకి ఎత్తి 2,58,705 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 77.40 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 8,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి: జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతున్నది. మంగళవారం సాయంత్రం వరకు 4,51,833 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, 38 గేట్ల ద్వారా గోదావరిలోకి 4,89,996 క్యూ సెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి 2,32,128 క్యూసెక్కులు వస్తుండగా, కడెం నుంచి 14,964 క్యూసెక్కులు, పరివాహక ప్రాంతం నుంచి 2,04,741 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.064 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తున్నదని, ఈ నేపథ్యంలో 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెడుతున్నామని, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సర్కిల్ 7 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి రవీంద్రాచారి కోరారు.

మిడ్ మానేరుకు..

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) ప్రాజెక్టుకు మంగళవారం 15161 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 7450, మానేరు, ములవాగు ద్వారా 7741 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు రెండు గేట్ల ద్వారా 8000 క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.9 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.299 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.


అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండుపంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.07టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీకి పెరిగిన వరద

తిమ్మాపూర్: వర్షాలతో ఎగువ నుంచి కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి వస్తున్న వరద పెరిగింది. సోమవారం వరకు కేవలం ఎల్ఎండీ స్పీల్ వే రెండు గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసిన అధికారులు, ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు మరో 4 గేట్లు ఎత్తారు. మొత్తం 6 గేట్ల ద్వారా 14వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. మోయతుమ్మెదవాగు నుంచి 10,509 క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 7 వేల క్యూసెక్కులు, ఎగువ కాకతీయ నుంచి 800 క్యూసెక్కులు మొత్తం 18,309 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా 23.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి)

ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17 ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు.

అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎంమున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్.. భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలి ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు

అమరుల త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాటి అమరుల త్యాగాలను పాఠ్య పుస్తకాల్లో ముద్రించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా చాడ వెంకటరెడ్డి మండలంలోని పోలంపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు అనభేరి ప్రభాకర్‌రావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనభేరి ప్రభాకర్‌రావు సొంత గ్రామమైన పోలంపల్లిలో సీపీఐ పక్షాన



పోలంపల్లిలో సీపీఐ ర్యాలీలో చాడ వెంకట్‌రెడ్డి

భారీ ర్యాలీ నిర్వహించి ఆయనకు నివాళులర్పించడం గర్వంగా ఉందని అన్నారు. 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని తెలిపారు. అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని హైదారాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, మండల కార్యదర్శి బోయిని తిరుపతి, నాయకులు సూరం మల్లేశం, పిట్టల శ్రీనివాస్, ఎల్లాస్వామి, బండారి రమేష్, తిరుపతిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో సబ్బండ వర్గాలకు సమన్యాయం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రభుత్వంలో సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుగుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అధ్యక్షతన మాదిగల ఆత్మీ సమ్మేళన సభ జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో మంత్రిని మాదిగ నాయకులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ఖార్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ మాదిగల పక్షాన మంత్రిగా తనకు అవకాశం ఇచ్చారన్నారు. నేరెళ్ల సంఘటనపై ఆరోజు కాంగ్రెస్ నాయకులం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించామన్నారు. నాటి స్పీకర్ మీరా కుమారి స్వయంగా వచ్చి నేరెళ్ల బాధితులను పరామర్శించినప్పుడు బాధితుల ఆవేదన కన్నీల్లు పెట్టించిందన్నారు. కేటీఆర్, సంతోష్‌రావు తదితరులు విచక్షణా రహితంగా నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు చేయించారని ఆరోపించారు.

అసెంబ్లీలో ముఖ్యమైన ఘటం వర్గీకరణ చట్టంను అమలు చేస్తుంటే చట్టసభకు రాకుండా ఫాంహౌస్‌కు పరిమితం అయ్యాడని ఆరోపించారు. దళితులకు చెందాల్సిన భూములు వారికిచ్చే బాధ్యతను తీసుకుంటామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ మాట్లాడుతూ చంద్రంపేట చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య విగ్రహం ఏర్పాటు, అదేవిధంగా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మాణం చేయాలన్న నాయకుల ప్రతి పాదనను పరిశీలిస్తామన్నారు. రగుడు వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని దళిత నాయకుడు రాగుల రాములు విజ్ఞప్తిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మాజీవిప్ ఆరెపెల్లి మోహన్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్టీఐ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

● **రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి**



మాట్లాడుతున్న ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమాచార హక్కు చట్టం-2005ను అధికారులు కట్టుదిట్టంగా అమలుచేయాలని రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమాచార అధికారులకు ఆర్టీఐ చట్టం అమలులో ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేశారు. సమాచార హక్కు చట్టం సంబంధించి జిల్లాలో పెండింగ్ ఉన్న 134 కేసులను కమిషన్ సభ్యులు పరిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పిలేట్ అథారిటీ, రెండో అప్పిలేట్ అథారటీ పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలన్నారు.

జవాబుదారీతనం పెరిగింది

సమాచార హక్కు చట్టం కారణంగా ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారీతనం పెరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి కార్యాలయానికి వచ్చే ఆర్టీఐ దరఖాస్తుకు సకాలంలో సమాధానం అందించేలా అధికారులకు ఆదేశాలు అందించామన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాసరావు, అయోధ్యరెడ్డి, మొహసిన పర్వీన్‌లు మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం ప్రజల్లో తీసుకుని వెళ్లేందుకు వారధులుగా ప్రభుత్వ అధికారులు సిబ్బంది పని చేయాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రినిరెడ్డి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఫస్ట్ అప్పీలేట్ అధికారులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాక్సింగ్, ఉషు పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్, ఉషు పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ తెలిపారు. బుధవారం అండర్- 17 బాల బాలికల విభాగాల్లో బాక్సింగ్ పోటీలు, గురువారం ఉషు పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు.

ఆసక్తి గల క్రీడాకారులు హెచ్‌డీఎఫ్ ఎలిజిబిలిటీ ఫాం, ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాష జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ఏజీఎం విజయ్‌కుమార్ సిక్దర్

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాష జాతీయ అవార్డు లభించింది. అధికారిక భాషా విధానం అమలులో విశేష కృషి చేసినందుకుగాను 2024-25 సంవత్సరానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రామగుండం ఎన్టీపీసీ రాజ్‌భాష కమిటీని జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్ అవార్డును అందుకున్నారు. ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత నాయకత్వంలో హిందీ భాషను ప్రోత్సహించడం, ప్రచారం చేయడంలో రాజ్‌భాష కమిటీ అంకితభావంతో పని చేసిందని యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

ధర్మపురిలో ఘనంగా ఉట్టి వేడుకలు



ఉట్టి వేడుకల్లో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

ధర్మపురి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ధర్మపురి క్షేత్రంలోని ఇసుక స్తంభం వద్ద మంగళవారం ఉట్టి వేడుకలు నిర్వహించారు. స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శెహరితో ఇసుక స్తంభం వరకు వెళ్లి ఉట్టి కొట్టి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ధర్మ కర్తలు ఏదులాపురం మహేందర్, రావర్తి సాయి కిరణ్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు. మంగళ వారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల క్రీడలు



కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ కళాశాలల అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్‌ను మంగళవారం డీఐఈవో వి.గంగాధర్, పోటీల నిర్వహణ కార్యదర్శి జి.మధుజాన్సన్ ప్రకటించారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లాస్థాయిలో గురువారం నుంచి నవంబరు 7 వరకు నిర్వహించనున్నారు. మొత్తం 37 క్రీడాంశాలలో నిర్వహించే ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అర్హత ఫారంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్, పదో తరగతి మెమో జిరాక్స్ కాపీలను జపరచాల్సి ఉంటుంది. ఈ పత్రాలపై కళాశాలల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరుకావాలి. మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, సత్యవర్ధన్ రావు, ఆంజనేయరావు, రాజేశ్వరరావు, శశిధర్‌శర్మ, నిర్మల, వెంకటరమణాచారి, బల్వీందర్‌సింగ్ పాల్గొన్నారు.

క్రీడల షెడ్యూల్

జగిత్యాలలోని పొన్నాల గార్డెన్స్‌లో గురువారం బాలబాలికల విభాగంలో తైక్వాండో, కరాటే, బాక్సింగ్, తైక్వాండో మార్షల్ ఆర్ట్స్, 19న కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు చెస్, యోగాసన పోటీలు నిర్వహించనున్నారు. 20న కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో బాలురకు ఫుట్‌బాల్, అనంతరం అక్టోబరు 6న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో బాల బాలికలకు ఉషు, జూడో, 7న అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో బాలురకు కబడ్డీ పోటీలు, 8న టీజీడబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల చింతకుంటలో బాలికలకు కబడ్డీ, 9న తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో బాలురకు వాలీబాల్, 10న టీజీడబ్ల్యూఆర్ఎస్ చింతకుంట జూనియర్ కళాశాలలో బాలికలకు వాలీబాల్, 13న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు అథ్లెటిక్స్, 17న జగిత్యాలలోని మినీ స్టేడియంలో బాలబాలికలకు క్రికెట్, 18న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నోలో బాలబాలికలకు నెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, 23న గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బాల బాలికలకు వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్ పోటీలు ఉంటాయి.

24న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలురకు ఖో-ఖో, 25న అంబేద్కర్ స్టేడియంలో బాలికలకు ఖో-ఖో, 26న కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో బాల బాలికలకు బాస్కెట్ బాల్, 28న జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, 29న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నోలో బాలబాలికలకు స్విమ్మింగ్, 31న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు హాకీ, నవంబరు 4న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో బాలబాలికలకు సైక్లింగ్, 6న కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు ఆర్చరీ, 7న జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు రగ్బీ పోటీలు, జగిత్యాల క్లబ్‌లో బాలబాలికలకు షటిల్ బ్యాడ్మింటన్, షూటింగ్, జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తారు.



పరవళ్లు తొక్కుతున్న ఎగువ మానేరు

గంభీరావుపేట మండలం నర్మాల మానేరు ప్రాజెక్టు మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కూడవెల్లి, పల్వంచ వాగులు పొంగుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మానేరు జలాశయానికి వరద నీరు భారీగా వస్తోంది. ఎగువ మానేరు మత్తడి మీదుగా పరవళ్లు తొక్కుతోంది. దీంతో మానేరు వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండటంతో సిద్దిపేట-కామారెడ్డి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి.

- గంభీరావుపేట, ఆంధ్రజ్యోతి

రహదారులకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

అర్నకొండ-మల్యాల రోడ్డు నిర్మించాలని ప్రస్తావించారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఒప్పించి అర్నకొండ-మల్యాల రోడ్డుకు 50 కోట్ల రూపాయల నిధుల విడుదలకు కృషి చేశారు. చొప్పదండి నియోజక వర్గంలోని అర్నకొండ నుంచి మల్యాల క్రాస్ రోడ్డు వరకు 35 కిలోమీటర్ల మేర రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు 50 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. ఈ రోడ్డు విస్తరణతో చొప్పదండి నియోజక వర్గంలోని 15 గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరనున్నది. వేములవాడ నుంచి సిరికొండ వరకు రోడ్డు నిర్మాణానికి గాను 23 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలి

రామడుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిర్మలాపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ద్వారా రామడుగు మండలంలో ఎక్కడైనా వడ్ల కొనుగోలు కేంద్రం ఇప్పించాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విన్నవించారు. చైర్మన్ గంట్ల రవీందర్ రెడ్డి, డైరెక్టర్స్ గోపు శ్రీనివాస్ రెడ్డి, పొన్నం సత్యనారాయణ, మన్నె కిషన్ చందర్, పుల్కం రాజమల్లు, ఎలగందుల శ్రీనివాస్, పల్లె రాంరెడ్డి, సీఈవో రాజు, అనిల్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని రాజకీయంగా ఎదుర్కొనే సత్తా కేటీఆర్‌కు లేదు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా కేటీఆర్‌కు లేదని, అందుకే పరువు నష్టం కేసు వేశారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ గతంలో వేసిన కేసు కోర్టులో నిలవలేదన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

భగత్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీ ఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ విద్యార్థులను మంగళవారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జి.స్ఫూర్తి, డి.శ్రీహిత ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు నిష్ణాతులైన వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడాంశాల్లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

విమోచన వేడుకలను ఘనంగా నిర్వహించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతి పోలింగ్ బూత్‌లో బీజేపీ నాయకులు జాతీయ జెండా ఎగురవేయాలని పేర్కొన్నారు.

ఆవోపా ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశరయ్య జయంతి సందర్భంగా ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో మంగళవారం ఇంజనీర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీర్లు శ్రీనివాస్‌గుప్త (ఎస్‌ఈ ఇరిగేషన్), బాల ప్రసాద్ (డీఈ ట్రాన్స్‌కో), తంగడపల్లి రమేశ్ (ఏఈ ట్రాన్స్‌కో), నలుమాచు అఖిల (ఏఈ మిషన్ భగీరథ), కొండూరి వరుణ్ (డీఈ మున్సిపల్), దోమకుంట్ల శ్రీనివాస్ (డీఈ ట్రాన్స్‌కో), పెద్ది ప్రమోద్‌కుమార్ (సివిల్ ఇంజనీర్), రిటైర్డు ఇంజనీర్లు కొంతం కృష్ణమూర్తి, రాచర్ల వసంతంను సన్మానించారు. ఆవోపా రాష్ట్ర సలహాదారు గంజి స్వరాజ్‌బాబు, పట్టణ అధ్యక్షుడు నలుమాసు సుదర్శనం, బీవీ ప్రవీణ్‌కుమార్, అయిత యోగేంద్ర ప్రసాద్, పుల్లూరు రవీందర్, ఆవోపా జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ నారాయణ, పీవీ రామకృష్ణ, ఆవోపా భవన్ ట్రస్ అధ్యక్షుడు కట్కూరి సుధాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి వల్లాల సత్యనారాయణ, కోశాధికారి కట్కూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు నలుమాచు చంద్రశేఖర్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో అద్విత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ అద్విత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల ది జీనియస్ అరేనా 2025 పేరుతో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు కే ఆరాధ్య అండర్-14 బాలకల విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సొగాని కొమురయ్య, డైరెక్టర్ సొగాని అనుదీప్ విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ సొగాని అనుదీప్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘం తపస్ రాష్ట్ర కార్యదర్శి అంబటి వేణుకుమార్ అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇల్లందకుంట మండలంలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించారు. తిరుపతి రావు, శ్రీధర్‌రెడ్డి, సాంబయ్య, కుమారస్వామి, సురేష్, తిరుపతిరెడ్డి, సత్యనారాయణపాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

వీణవంక, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం హుజురాబాద్ నియోజికవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి,నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి,కర్ర తిరుపతి, చినాల అయిలయ్య ఉన్నారు.

● గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు రూ.10,40,500ల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం గుండ్లపల్లి రైతు వేదికలో పంపిణీ చేశారు. తహశీల్దారు నరేందర్‌తో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏవో కిరణ్మయి, డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, కేడీసీసీ డైరెక్టర్ అలువాల కోటి, గుంటుక లింగయ్య ఉన్నారు.

ఉత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులకు ప్రోత్సాహం

శంకరపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన కేశవపట్నం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ ప్రోత్సాహకంగా స్పోర్ట్స్ షూ మంగళవారం అందజేశారు. హెచ్‌ఎం సుభాష్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులు చెల్లించాలని ఆందోళన

శంకరపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి వైద్య ఖర్చులు చెల్లించాలని పనికి పంపించిన వారి ఇంటి ఎదుట కన్నాపూర్‌లో బాధితులు ఆందోళనకు దిగారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన సంధ్య అనే మహిళ తన కొడుకును జమ్మికుంట హాస్టల్ నుంచి ఇంటికి తీసుకురావాలని అదే గ్రామానికి చెందిన సల్మాన్, శ్రీకాంత్ అనే వ్యక్తులను పంపించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో సల్మాన్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. మంగళవారం వైద్య ఖర్చులు చెల్లించాలని సంధ్య ఇంటి ముందు సల్మాన్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

రామడుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామడుగు మండలంలోని గుండి గ్రామంలో రైతాంగ సాయుధ పోరాట అమరులు గుండి దామోదర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, గీంటి రాజేశం, దుర్గం రాజేశం ఉన్నారు.

కేంద్ర మంత్రి కృషితో అభివృద్ధి నిధులు

భగత్‌నగర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కృషితో పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి నిధులు మంజూరైనట్లు బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి బోయినపల్లి ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

రోడ్ల మరమ్మతుకు కార్యాచరణ రూపొందించాలి

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ అధికారులతో నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితితోపాటు వివిధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. పంచాయతీ రాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ రహమాన్, డిప్యూటీ ఈఈలు మంజులా భార్గవి, రవి ప్రసాద్, ఏఈలు సురేందర్ రెడ్డి, ప్రవీణ్, మల్లేశం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు తయారు చేయించి ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. బ్రిడ్జి విషయంపై కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను పలుమార్లు కరీంనగర్, హైదరాబాద్, ఢిల్లీలో కలిసి చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీకి, మంజూరు కోసం కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు, రాష్ట్ర మంత్రి వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్యే కవ్వంపలల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. పోరాటాలతోనే బ్రిడ్జి కల సాధ్యమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి



కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను పరిరక్షించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ అన్నారు. మంగళవారం బోటనీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు.

తిమ్మాపూర్: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా మండలంలోని మల్లాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్నంగా రంగురంగుల గొడుగులు, ప్లకార్డులతో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయిని ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: ఓజోన్ పొర పలుచబడితే ప్రాణికోటి మనుగడ ప్రశ్నార్థకమేనని కెప్టెర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం విద్యార్థులకు శాతవాహన లయన్స్‌క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు.. క్లబ్ కార్యదర్శి గాండ్ల చంద్రశేఖర్, స్కూలు చైర్మన్ శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు పచ్చునూరి సురేందర్, కోశాధికారి సత్యం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 7:30 నుంచి 9:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ 1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శ్రీవేంకటేశ్వర ఆలయం, శివ థియేటర్, కెమిస్ట్రీ భవన్, బీజేపీ కార్యాలయం ఏరియా, కోర్టు వెనుక వైపు, సెయింట్ ఆల్ఫోన్స్, కేడీఆర్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

హుజూరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, సైదాపూర్ క్రాస్‌తోపాటు పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా విధించారు. అనంతరం ఏసీపీ మాధవి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా సంబంధిత ధ్రువపత్రాలు వెంట ఉంచు కోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి జీవితాలను నాశనం చేసుకో వద్దన్నారు.

యశోద ఆస్పత్రిలో అరుదైన గుండె శస్త్ర చికిత్స

సుభాష్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి) : హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో అరుదైన గుండె శస్త్ర చికిత్స నిర్వహించినట్లు సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ విక్రమ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేరెళ్ల నాగయ్యకు నిరంతరం దగ్గు రావడం, గొంతు బొంగురుపోవడం, ఛాతిలో స్వల్పంగా నొప్పి రావడంతో పరీక్షలు నిర్వహించగా అయోర్టిక్ ఆర్చ్ దగ్గర (గుండె లోపలి భాగంలో) గుండెకు రక్త ప్రసరణ చేసే నాళం ఉబ్బి ఉందని గుర్తించారు. ఇలాంటివి లక్ష మందిలో ఇద్దరికి వస్తాయని, ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు. క్లిష్టమైన అయోర్టిక్ ఆర్చ్ రిపేయిర్(ఆపరేషన్) విజయవంతంగా నిర్వహించారు. ఫ్రోజెన్ ఎలిఫెంట్ ట్రంక్ వంటి అధునాతన పద్ధతులను ఉపయోగించినట్లు డాక్టర్ విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ తరువాత పేషంట్ త్వరగా కోలుకున్నాడని, ఎలాంటి సమస్యా లేకుండా సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు. అధునాతన వైద్య సదుపాయాలు, పరికరాలుతోపాటు అనుభవజ్ఞులైన డాక్టర్లు హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విక్రమ్‌రెడి

టీజీ ఎన్‌పీడీసీఎల్ డిస్కం కార్యదర్శికి ఘన స్వాగతం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న నిజామాబాద్‌లో నిర్వహించిన 1104 యూనియన్ టీజీ ఎన్‌పీడీసీఎల్ డిస్కం ఎన్నికల్లోఏకగ్రీవంగా ఎన్నికైన సల్వాజి రమణరావుకు ఘన స్వాగతం పలికారు. మంగళవారం నగరంలోని 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వీరయ్య ఆధ్వర్యంలో విజయోత్సవర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ భాస్కర్, కన్నం నర్సింగరావు, ప్రాంతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రమణారెడ్డి, అడిషనల్ సెక్రెటరీ సాన జయకర్, సలహాదారు సురేఖ, కరీంనగర్ టౌన్ డివిజన్ అధ్యక్షుడు మల్లేశం, సెక్రెటరీ, కే.శ్రీనివాస్, రూరల్ డివిజన్ సెక్రెటరీ, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న 1104 యూనియన్ నాయకులు

ఎస్‌జీఎఫ్‌లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచి మెడల్స్ సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ఈ నెల 15న అండర్-17 విభాగం వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ నెల 29న మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరగబోయే 13వ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థి కె.రాహుల్‌ను అభినందించారు. కళాశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, జూనియర్ కళాశాలల డీన్ జగన్ మోహన్ రెడ్డి, డిఫెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ముద్దసాని రమేష్ రెడ్డి

అభివృద్ధే లక్ష్యంగా కేంద్రం నిధులు

భగత్‌నగర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కోట్లాది రూపాయలు తీసుకొచ్చారని మాజీ మేయర్ సునీల్‌రావు అన్నారు. సీఆర్ఐఎఫ్ స్కీం కింద కరీంనగర్ నియోజక వర్గం అభివృద్ధికోసం రూ.150 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మానేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.75 కోట్లు, అర్నకొండ-మల్యాల రోడ్డుకు రూ.50 కోట్లు వేములవాడ సిరికొండ రోడ్డుకు రూ. 25 కోట్ల నిధుల మంజూరి ఇప్పించినట్లు వివరించారు.

గన్నేరువరం : మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 77 కోట్ల నిధుల మంజూరుకు జీవో విడుదల చేయించి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట నిలబెట్టుకున్నారని బీజేపీ శ్రేణులు మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణా సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్, బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్, నాయకులు పుల్లెల రాము, మచ్చ బాలరాజు, తిరుపతి, లింగయ్య పాల్గొన్నారు.

చొప్పదండి :అర్నకొండలో బీజేపీ మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: చొప్పదండి నుంచి మల్యాల వరకు పలు గ్రామాలను కలుపుతూ డబుల్ రోడ్ కోసం రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయడంపై మండలంలోని గోపాల్‌రావు పేటలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, నాయకులు పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ టౌన్:నగరంలోని కోతిరాంపూర్ పోచమ్మ ఆలయ హుండీలను ఈనెల 18న మధ్యాహ్నం ఒంటి గంటకు లెక్కించనున్నట్లు ఆలయ ఈవో మారుతి ఒక ప్రకటనలో తెలిపారు.

మానకొండూర్: మండలంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపులో రూ.లక్షా 50వేలు వచ్చినట్లు ఈవో మారుతి తెలిపారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని వెంకట్ ఫౌండేషన్ బాల గోకులం, సంక్షేమ ట్రస్ట్ కపిల్ కుటీర్, ఓపెన్ షెల్టర్ సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని వాకాడే తానాజీ మంగళవారం సందర్శించారు. కేంద్రాల్లో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.

సుభాష్‌నగర్: మాంగ్ కులస్తులకు తహసీల్దార్ కార్యాలయం ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని తెలంగాణ మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు గాడేకర్ రామేశ్వర్ మాంగ్ కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు.

భగత్‌నగర్: న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బాలకిషన్‌రావు, బండ గోపాల్‌రెడ్డి, లంబు రాజిరెడ్డిని సన్మానించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షురాలు వేల్పుల శశికళ పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర మండలం వెంకంపల్లి నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అధికారులు మంగళవారం స్థలం చదును చేయించారు.

వీణవంక:మండలంలోని కోర్కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మండల విద్యాధికారిని శోభారాణి, ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి ఉన్నారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని పంచముఖ అనుమదీశ్వర ఆలయ ప్రాంగణంలో పితృపక్షాల సందర్భంగా మంగళవారం ఆరుద్ర నక్షత్రం దహిని పురస్కరించుకొని 27 నక్షత్రాలకు ప్రీతిగా లోక కల్యాణార్థం మొక్కలను నాటారు.

సుభాష్‌నగర్: స్వస్థనారి సశక్తి పరివార్ కార్యక్రమాన్ని బుధవారం జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూరు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం కరీంనగర్ రూరల్ మండల స్థాయిలో ప్రాథమిక పాఠశాలల బోధన అభ్యసన ఉపకరణాల ప్రదర్శన పోటీల ఉత్సవం నిర్వహించారు. ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరు కరీంనగర్ జాతీయ సేవాసంస్థ వలంటీర్లు మంగళవారం గ్రామ శివాలయాన్ని శుభ్రం చేశారు.

కరీంనగర్ స్పోర్ట్స్: తొమ్మిదో తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో పది రోజులు నిర్వహించిన వార్షిక శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఏకే జయంత ఉత్తమ కేడెట్లకు బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు.

హుజూరాబాద్:పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి కళా ఉత్సవ్ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్‌లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలు రాష్ట్రానికి నూతన వైభవాన్ని తెస్తాయ న్నారు. ఈ పండుగ ద్వారా సమాజంలో ప్రేమ, ఆప్యాయతలు వ్యాప్తి చెందుతా యని, తెలంగాణ రాష్ట్ర ప్రతీక బతుకమ్మ పండగ అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాల్లో నరేందర్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భగత్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): కొత్తపల్లి పట్టణంలోని 17, 18 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు డీసీసీ జనరల్ సెక్రెటరీ పొన్నం సత్య నారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్ నిధులతో రూ.19.330 లక్షల వ్యయ ంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను ప్రారం భించారు. కొత్తపల్లి పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ కనకరెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ హనుమంత రెడ్డి, పొన్నం శ్రీనివాస్, దుబాసికుమార్, రాజు, మునీందర్, కుటాడి శ్రీనివాస్,ముజాహిద్ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సత్యనారాయణ

● అవీఇవీ..

గంగాధర: గ్రామాల్లో ఇంటి పన్ను బకాయిల వసూళ్లలో వేగం పెంచాలని ఎంపీవో గౌరిరమేష్ అన్నారు. మంగళవారం కురిక్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పర మల్యాల, గర్షకుర్తి, ఆచంపల్లిని సందర్శించారు.

- గంగాధర మండలం ఒద్యారం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మంగళ వారం మండల స్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఎంఈవో ప్రభాకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామడుగు : మండలంలోని వెలిచాల లో జరుగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో మంగళవారం సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గన్నేరువరం : గన్నేరువరంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి పెద్దమ్మ చింతల వజ్రమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే సత్యనారాయణ పరామర్శించారు.

చొప్పదండి:మండలంలోని ఆర్నకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ప్రాథమిక పాఠశాలల టీఎల్‌ఎం నిర్వహించారు.

తిమ్మాపూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర విద్య పరిశీలన మండల డైరెక్టర్ గాజర్ల రమేష్ ఉపాధ్యాయులకు సూచించారు. రేణికుంట ప్రభుత్వ పాఠశాలలు, రామకృష్ణ కాలనీ, తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల, ఎల్ ఎండీ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.

యూరియా కొరత పాపం కేంద్రానిదే

హుజూరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత పాపం కేంద్ర ప్రభుత్వానిదేనని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 147మంది లబ్ధిదారులకు రూ. 54,31,500 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని రాష్ట్రాలకు యూరియా సరఫరా చేసేది కేంద్ర ప్రభుత్వమని, అది బీజేపీ ఎంపీలే చెప్పారని అన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ యూరియా విషయంలో చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా యూరియా కొరత ఉందని, దానికి ఈటల సమాధానం చెప్పాలని అన్నారు. మరో వైపు మాజీ మంత్రి కేటీఆర్ యూరియా విషయంలో పిట్ట కథలు చెప్తున్నారన్నారు. పట్టణంలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు అతి త్వరలోనే కేటాయిస్తామన్నారు.

పేద మహిళలకు ఉచిత వైద్యం

హుజూరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): పట్టణానికి చెందిన వైద్యురాలు డాక్టర్ సుజాత పేద మహిళలకు ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తూ సామాజిక దృక్పథాన్ని చాటుతున్నారు. రెండు నెలల్లో 150 మందికి ఉచితంగా సర్జరీలు చేశారు. ప్రతిరోజు గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. హుజూరాబాద్ పట్టణంలోని రేడియో సత్తయ్య కాలనీలో ఆమె ఆసుపత్రి ఉంది. పేదలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్నట్లు డాక్టర్ సుజాత తెలిపారు. తమ ఆసుపత్రిలో పేద గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు చేస్తామన్నారు. పేద మహి ళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మహిళలతో మాట్లాడుతున్న డాక్టర్ సుజాత

ఘనంగా మాజీ ఎంపీ రాజేశ్వర్‌రావు జయంతి



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద మాజీ ఎంపీ వొడితెల రాజేశ్వర్‌రావు జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌తోపాటు పలువురు నాయకులు రాజేశ్వర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వర్‌రావు చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.రాజేశ్వరరావు, అకాడమిక్ డీన్ వేణుగోపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు హుజూరాబాద్‌లో రాజేశ్వర్‌రావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సలీం, పరమేష్, మల్లేష్, కిషన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.